క్లుప్తంగా

సరిపల్లిలో చైన్ స్నాచింగ్

పెందుర్తి: మండలంలోని సరిపల్లిలో సోమవారం చైన్ స్నాచింగ్ జరిగింది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ప్రకారం...సరిపల్లిలో గంజి నారాయణమ్మ ఇంటి ముందు కూరగాయల వ్యాపారం చేస్తోంది. మధ్యాహ్నం ఇద్దరు బైకుపై వచ్చి గుర్రంపాలేనికి వెళ్లే దారి ఎటువైపు అని నారాయణమ్మను అడిగారు. ఆమె ఎటువైపు వెళ్లాలో సూచిస్తున్న సమయంలోనే మెడలో ఉన్న సుమారు 5తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయారు. బాధితురాలు అరవడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూసినప్పటికే ఉడాయించారు. నారాయణమ్మ ఫిర్యాదు మేరకు పెందుర్తి క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ


విద్యార్థి జయవర్ధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యారావు తదితరులు

సింహాచలం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన అండర్–19 త్రోబాల్ పోటీల్లో సింహాచలంలోని మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ బీసీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థి ఎస్. జయవర్ధన్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.సత్యారావు తెలిపారు. కళాశాలలో సోమవారం జయవర్ధన్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కె. దుర్గాప్రసాద్, పీఈటీ అప్పారావులను ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర సిబ్బంది అభినందించారు.

విద్యుత్తు పొదుపు ప్రగతికి మలుపు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

సబ్బవరం:విద్యుత్తును ఆదా చేయడం ద్వారా ప్రగతిని సాధించవచ్చునని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిరీక్షణ్ అంబేడ్కర్ అన్నారు. విద్యుత్తు పొదుపు వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది మండల కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెక్షన్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పలు వ్యాపార సంస్థలతో పాటు ఇళ్లకు వెళ్లి విద్యుత్తు ఆదాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఎల్ఈడీ బల్బులు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈలు బి. వీరేంద్ర, జి. అశోక్‌తో పాటు విద్యుత్తు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో వైద్య భరోసా


వర్చువల్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పరవాడ: ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ఉచిత వైద్యం అందించే మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు భరోసా కల్పించారని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అన్నారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచుతూ సోమవారం సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు పి.కనకారావు, వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, సర్పంచ్ వెన్నల అప్పారావు, చిన్నారావు పాల్గొన్నారు.

దోభీ ఘాట్ నిర్మించాలి

పరవాడ: తానాం గ్రామంలో రజక వృత్తిదారులు వృత్తి కొనసాగించేందుకు దోభీగాట్లు నిర్మించాలని అనకాపల్లి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు కోరారు. దోభీగాట్ లేక పడుతున్న ఇబ్బందులపై అధికారులకు వినతిపత్రం అందజేసినా స్పందన లేదన్నారు. రజకులకు ఆధారమైన నేల బావిని సోమవారం ఆయన పరిశీలించారు. ఫార్మా వ్యర్థాలతో బావి కలుషితం కావడంతో వృత్తికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తానాం రజకులకు న్యాయం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

మండల జనాభా	గ్రామసచివాలయాలు	నిర్మించిన సొంత భవనాలు	మొత్తం వ్యయం
48,626	14	14	రూ.4.40 కోట్లు

అవ్వా తాతలకు తెలతెలవారక ముందే పింఛన్లు అందించే వారధి..ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సారధి..ప్రభుత్వానికి..సామాన్యులకు సమన్వయకర్త..అదే అత్యుత్తమ, ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక గ్రామ సచివాలయ వ్యవస్థ.

- సచివాలయాల ఏర్పాటుతో తీరిన ప్రజల కష్టాలు
- పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు
- ప్రజల మోములో ఆనందం

మనసొంతం గ్రామ స్వరాజ్యం


ముత్యాలమ్మపాలెంలో నిర్మించి గ్రామ సచివాలయ భవనం




పరవాడలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-2

పరవాడ: మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారు. ప్రజల చెంతకే పాలన అందించాలనే లక్ష్యంతో సచివాలయ సిబ్బందితో పాటు 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. రేషన్‌కార్డు, సామాజిక పింఛన్లు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సాధారణ సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయమే కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు.

నాడు దూరా భారం

ఒకప్పుడు మండల కేంద్రంలో ఉన్న కార్యాలయాలకు వెళ్లలేక సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడేవారు. దీంతో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. నేడు అధికార యంత్రాంగం ప్రజలకు చేరువగా ఉండి సేవలందిస్తున్నారు. ఏ పని కావాలన్నా పారదర్శకంగా రోజుల వ్యవధిలోనే అవుతోంది. సామాజిక పింఛన్లు ఠంచన్‌గా ఒకటో తేదీన అందిస్తున్నారు. పథకాల కోసం ప్రజల చెంతకే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో సచివాలయ వ్యవస్థ ప్రజల మన్ననలు అందుకుంటుంది.

అర్హత ఉంటే అన్నీ ఇంటికే..

గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత సాధించాలంటే జన్మభూమి కమిటీలను మెప్పించాల్సి వచ్చేది. వారు దయ తలచినా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాలి. అర్జీ పెట్టుకున్న తర్వాత పథకం వర్తించడానికి నెలలు, సంవత్సరాలు వేచి చూడాల్సిన పరిస్థితి. పథకం అందుకోవాలన్నా ×మేమే మీ పని చేయించాం. మాకు ఎంతో కొంత ఇచ్చుకోవాలి..లేకపోతే జాబితాలో పేరు ఉండదు¤ అని జన్మభూమి కమిటీ సభ్యుల చేతివాటం. ఇలాంటి తరుణంలో 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ ఈ జాడ్యానికి చరమగీతం పాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతీ పథకం అర్హత ఉన్న అందరికీ అందిస్తున్నారు. సామాజిక పింఛన్ల నుంచి ఇంటి స్థలం వరకు ప్రతీది ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పేరు నమోదు చేసుకుని.. దాన్ని సచివాలయంలో ధ్రువీకరించి..పథకాన్ని అందించే దృఢమైన పాలనా వ్యవస్థను తీసుకువచ్చారు. ఇంటి వద్దే సంక్షేమం అందుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.


విధుల్లో నిమగ్నమైన వాడచీపురుపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగులు

ఇదీ పరిస్థితి

మండలంలో 48,626 మందికి పైగా జనాభా ఉంది. వీరికి సేవలందించడానికి 14 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. భవన నిర్మాణాలకు దాదాపు రూ.4.40 కోట్లు ఖర్చు చేశారు. తానాం, పరవాడ-2, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి-1 గ్రామాల్లో ఒక్కో గ్రామ సచివాలయ భవనం రూ. 40 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించారు. కలపాక, పరవాడ-1, గొర్లివానిపాలెం గ్రామాల్లో ఒక్కొక్కటి గ్రామ సచివాలయ భవనాన్ని రూ.రూ.35 లక్షల వ్యయంతో ..రూ.25 లక్షల చొప్పున వ్యయంతో వాడచీపురుపల్లి, కన్నూరు, వెన్నలపాలెం, నాయుడుపాలెం, భర్నికం, రావాడ, పెదముషిడివాడ గ్రామాల్లో సచివాలయాల భవనాలు నిర్మించింది. వీటి ద్వారా ప్రజల చెంతకే పాలన వచ్చింది. తద్వారా గ్రామ స్వరాజ్యానికి బాటపడింది.

సంతోషంగా ఉంది



నాకు ముగ్గురు సంతానం. పెళ్లిళ్లు చేశాను. వృద్ధాప్యం మీద పడింది. నా పెద్దకొడుకు జగన్‌బాబు అందిస్తున్న పింఛన్‌తో కాలం వెల్లదీస్తున్నాను. వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నాడు. గతంలో తిరగాల్సి వచ్చేది. సచివాలయం వచ్చిన తర్వాత మా బాధలు తప్పాయి. ఏ పని అయినా సులువుగా అవుతుంది.

– వాసిరెడ్డి సన్యాసమ్మ, వెన్నలపాలెం

ప్రజలకు చేరువగా..



పేద ప్రజలకు అవసరమైన సేవలు అందించడం ఆనందంగా ఉంది. రేషన్ కార్డులు, భూ సమస్యలు, పట్టాదారు పాస్‌పుస్తకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి వాటిని ప్రభుత్వానికి నివేదిస్తాం. సంక్షేమ పథకాలకు సంబంధించి అయితే వలంటీర్లతో కలిసి మేమే ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– ఎం.కనిష్కా, డిజిటల్ అసిస్టెంట్, వాడచీపురుపల్లి సచివాలయం-1

ఇబ్బందులు తప్పాయి



ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తప్పాయి. గతంలో ఏ ధ్రువ పత్రం కావాలన్నా కిలోమీటర్ల దూరంలో ఉన్న పరవాడ తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం అటువంటి ఇబ్బందులు లేవు. కుల, ఆదాయ, నివాసం వంటి ధ్రువ పత్రాలను రెండు రోజుల్లోనే పొందుతున్నాం. సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

కూండ్రపు అప్పలనాయుడు, నాయుడుపాలెం

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి మహోత్సవం


స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న చొక్కాకుల వెంకటరావు దంపతులు


సామూహిక పూజల్లో పాల్గొన్న దంపతులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు లగుడువారి కొంపల వద్ద కొలువైన స్వయంభూ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు రవితేజ శర్మ వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, సతీమణి శిరీషతో పాటు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు,లక్ష్మి దంపతులు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ స్వామివారి దర్శించుకొని వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్ రాజు, శిరీష దంపతుల ఆర్థిక సహాయంతో నిర్వహించిన అన్న సమారాధనను ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు దీపాలంకరణ సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వెన్నెల సత్యనారాయణ, వనం నర్సింగరావు, లగుడు సూర్యనారాయణ, వనం చల్లారావు, లగుడు ముత్యాలనాయుడు, లగుడు దేముడు బాబు, లగుడు మహేష్, వనం సత్యనారాయణ, వెన్నెల స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

స్వయంభూ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు దంపతులు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. అదేవిధంగా ఆలయానికి అవసరమైన గ్రానైట్ వేయించడంతో పాటు స్వామివారి మూల విరాట్ విగ్రహానికి వెండి మకర తోరణం సమకూరుస్తామని తెలిపారు. విరాళం ఇచ్చినందుకు వెంకటరావు దంపతులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

భారీ అన్నసమారాధన

పెందుర్తి: జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లి శ్రీకోదండ సీతారామాలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ ఎ. ఎర్రయ్య, దువ్వి అప్పారావు,బొట్ట గోవింద్, అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని సోమవారం 98వవార్డులోని పాత అడవివరం, ప్రియాగార్డెన్స్, చంద్రాగార్డెన్స్‌లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

కనులపండువగా కల్యాణం

విజినిగిరిపాలెం దరి చంద్రాగార్డెన్స్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. వేదికపై వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అదిష్ఠింపజేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ విష్వేశ్వరపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం విశేషంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తులు పరవశించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.


పాతఅడవివరం శివాలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


చంద్రాగార్డెన్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం ధ్యేయం

పరవాడ: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. రావాడలో సోమవారం వైఎస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీకి ఎందుకు అవసరమో ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, నాయకులు కావలిరాజు, చల్లా కనకారావు, కావలి వాసు, తోట పవన్, ఎం.వెంకట్, కె.సత్యనారాయణ, కడవల రాజు, ఎం.అప్పలరాజు, దాలి నాయుడు, నూకరాజు, పంచాయతీ కార్యదర్శి అనూరాధ, వీఆర్వో భుజంగరావు, వలంటీర్లు పాల్గొన్నారు.


వలంటీర్లకు జగనన్న కిట్లు అందజేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

సింహగిరిపై విశేష పూజలు

సింహాచలం: సింహగిరిపై సోమవారం ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు పవన్‌కుమార్ తదితరులు ఈ పూజలను నిర్వహించారు.


విశేష అలంకరణలో గోదాదేవి

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు ఆరో రోజు సోమవారం విశేషంగా జరిగాయి. భక్తులు స్వామి నామస్మరణలో మునిగితేలారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అదిష్ఠింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో అదిష్ఠింపజేసి దివ్యప్రబంధపారాయణాలు పఠించారు.

వెంకన్న ఆలయంలో....

కొండదిగుడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి సన్నిధి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈపూజలు నిర్వహించారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం

- జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: దివ్యాంగుల అభ్యున్నతికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. తాండ్రపాపారాయుడు కల్యాణమండపంలో సోమవారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ అలీమ్ కో, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు పెనస్లు ఉద్యోగ, విద్యలో రిజర్వేషన్లు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపకరణాల కోసం పేరు నమోదు చేసుకుని వైద్యులు సూచించిన ఉపకరణాలు పొందాలని సూచించారు. వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె. మాధవి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు రూపొందించిందని తెలిపారు. ఉపకరణాల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 24వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు, జీవీఎంసీ జోన్–8 ఏపీడీ శ్రీ,రామ్, అలీమ్ కో వైద్యురాలు శ్వేత, కోఆర్డినేటర్ ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.


దివ్యాంగుల నుంచి కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

దివ్యాంగులకు ఆటలపోటీలు

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు దివాకర్‌రావు, సాయి శైలజ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ద్వారా అందిస్తున్న సహిత విద్యా కార్యక్రమాలను వివరించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. లుపిన్ పరిశ్రమ ప్రతినిధి రాజేష్, సీఎస్సార్ మేనేజర్ వెంకట్, దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ భోజన ఏర్పాట్లు చేశారు.

తుపాను బాధిత రైతుల జాబితా వెల్లడి

పెందుర్తి: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్ట పోయిన రైతుల వివరాలను పినగాడి, గుర్రంపాలెం, పెదగాడి,గొరపల్లి, సరిపల్లి సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. లబ్ధిదారులు తమ పేర్లు చూసుకుని ధ్రువీకరించుకోవాలని సూచించారు.

పల్లెల్లో మేలుకొలుపు

పరవాడ: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పరవాడ, బొట్టవానిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, లంకెలపాలెం, బొద్దపువానిపాలెం గ్రామాల్లో సోమవారం మేలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలిసా, పౌర్ణమి రోజు గ్రామంలో ప్రజలంతా కలిసి సామూహిక హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ నెలా ఏకాదశి, పౌర్ణమి రోజున నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా, భజన చేయడం చాలా మంచిదన్నారు.


మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కరాటే పోటీల విజేతలకు అభినందన

పరవాడ: శ్రీకాకుళంలో ఈ నెల 17న నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థులు సత్తా చాటి బహుమతులు అందుకున్నారని కోచ్ గొర్లి పుష్పారావు చెప్పారు. వీరంతా ఫిబ్రవరిలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఎన్టీపీసీ విద్యార్థులు

- జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని సమ్మెంగపాలెం, జాలరిపేట, కోరంగిపాలెం, మంగప్పగారి గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారని డ్రాగన్ లైన్స్ ఇన్‌స్టిట్యూట్ గ్రాండ్‌మాస్టర్ ఎస్.నూకరాజు చెప్పారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు.